క్లుప్తంగా

పంచాయతీ ఆదాయ వనరులు పెంచాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

యల్లనూరు: తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. బుధవారం యల్లనూరు మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని ఉద్యోగుల హాజరుపట్టికను తనిఖీ చేశారు. ఎస్కే కాల్వ రోడ్డులోని డ్రైనేజీని మెరుగురుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణసాగర్, డిప్యూటీ ఎంపీడీఓ మనోహర్, ఏఓ వాసుదేవరెడ్డి, ఏపీఓ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం ఇదే..

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామ సమీపంలోని కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దొంగలు ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.15 వేల నగదును అపహరించారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి వెంకటరమణ మరికొంత మంది గ్రామస్తులు ఘటనను గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆచూకీ లభ్యం



యువతికి కౌన్సెలింగ్ ఇస్తున్న పీఎస్ఐ గౌతమ్

గుత్తి: అదృశ్యమైన యువతి ఆచూకీని పోలీసులు కనుగొని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ యువతి మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు గాలింపు చేపట్టిన పీఎస్ఐ గౌతమ్ యువతి విజయవాడలోని ఓ దర్గాలో ఉన్నట్లు తెలుసుకున్నారు. వెంటనే పీసీలు భాస్కర్ నాయుడు, మహాలక్ష్మిని విజయవాడకు పంపి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పీఎస్ఐ గౌతమ్ యువతికి కౌన్సెలింగ్ అనంతరం యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



గౌసియాను అభినందిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి డిగ్రీ కళాశాల విద్యార్థిని గౌసియాను తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. గత నెలలో రెడ్ రిబ్బన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన క్విజ్ పోటీల్లో గౌసియా ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచింది. ఈనెల 14న ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, నాగరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గుంతకల్లు: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ జనాభాకు తగినట్టు పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం, ఉన్న వారు ఉద్యోగ విరమణ చేయడంతో పనిభారం పెరుగుతోందన్నారు. ఖాళీగా పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేయడంతోపాటు పదవీ విరమణ, మరణించిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల్లో వ్యక్తులకు ఎలాంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేత వీరభద్రస్వామి, సీఐటీయూ నేత నరసయ్య పాల్గొన్నారు.



తాడిపత్రి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



కూరగాయల మార్కెట్‌లోకి చేరిన వర్షపు నీరు



రాయల్ సర్కిల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ కాలువ

మోస్తరు వర్షానికే ఇలా...

గుత్తిలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికే రోడ్లపై భారీగా మురుగునీరు పారింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా అంబేడ్కర్ కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చేరడంతో బురదమయంగా మారింది. దీంతో కాయగూరల కొనుగోలు కోసం వచ్చిన జనాలు అవస్థలుపడ్డారు. తాడిపత్రి రోడ్డు, రాయల్ సర్కిల్లో డ్రైనేజీల్లో పూడిక పేరుకు పోవడంతో మురుగునీరు రోడ్లపై పారింది.

గుత్తి:

యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నాయకుడు రాజశేఖర్‌రెడ్డి

పెద్దవడుగూరు : ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నాయకుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్రిష్టిపాడు గ్రామంలో రైతుల సమస్యలపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా మొత్తాలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, సుబ్బు ఆచారి, జ్ఞానేశ్వర్, హరీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: కూటమి ప్రభుత్వం యూరియా సరఫరాలో పూర్తి విఫలం చెందిందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు తరిమెల రామాంజనేయులు విమర్శించారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రైతులకు ఎరువులను సకాలంలో రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేయలేదన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని కోరారు. అందుబాటులో వ్యవసాయాధికారి లేకపోవడంతో, వినతిపత్రంను కార్యాలయ తలుపునకు అతికించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, లక్ష్మీరంగయ్య, దుబ్బన్న, శీనా, సూరి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ సేవారత్న అవార్డుల ప్రదానం



జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనాకు అవార్డును అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురికి రాయలసీమ సేవ రత్న అవార్డులను ప్రదానం చేశారు. బుధవారం స్థానిక ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫరూఖ్‌ఖాన్, డీహెచ్‌పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు హనుమంతు, డాక్టర్ మంజూరు, ఎంపీడీఓ నాగభూషణం, లాయర్ హేమాద్రి, విక్టరీ ఫౌండేషన్ డాక్టర్ విజయకుమారి, పంచాయితీ సెక్రటరీ సుధాకర్, సాయి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, ఎంఆర్‌పీఎస్ నాయకుడు స్వామిదాస్, వజ్రకరూర్ సర్పంచ్ మోనాలిసా, లేబర్ ఆఫీసర్ శివప్రసాద్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాము, కానిస్టేబుల్ ఓబులేసుకు అవార్డులు అందజేశారు. అనంతరం కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇస్‌ర్ట్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, జేవీవీ నాయకులు లక్ష్మీప్రసాద్ యాదవ్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సలకంచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి శంకరనాయక్, సిబ్బంది

శింగనమల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్. శంకర్ నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని సలకంచెరువు, జూలాకాల్వ, నాయనవారిపల్లి గ్రామాల్లో వైద్య బృందం సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జ్వరం పీడితులను గుర్తించి వారికి వైద్య సేవలందించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఏలు భారతి, విజయ్‌కుమార్, రమణయ్య, ఆంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పీ హరిత, కౌసర్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

సమయ 'పాలన'పై నిర్లక్ష్యమేల?



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉదయం 11.30 గంటలైనా అధికారులు రాకపోవడంతో వేచి ఉన్న జనాలు

- వేళకు విధులకు హాజరుకాని ఉద్యోగులు
- ప్రజలకు తప్పని తిప్పలు

గుత్తి: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. గుత్తిలో సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ, మున్సిపల్, ఐసీడీఎస్, ఫారెస్ట్, పీఆర్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ వంటి ప్రభుత్వ శాఖలలో పని చేసే ఉద్యోగులు, అధికారులు సమయ పాలన పాటించడం లేదు. ఎవరికి ఇష్టం వచ్చినపుడు వారు వచ్చి వెళ్తున్నారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారులు, సంబంధిత విభాగాల ఉద్యోగులు ఎప్పుడు వస్తారో తెలియక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, ఆర్అండ్‌బీ, పీఆర్, ఇరిగేషన్ డీఈలు, ఏఈలు ఇలా ఎవ్వరూ స్థానికంగా నివాసం ఉండటం లేదు. స్థానికంగా ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ ఎవ్వరూ పాటించడం లేదు. ఉద్యోగులు, అధికారులు కార్యాలయాలకు ఉదయం 11 గంటల తర్వాతే వస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది కూడా అదేబాటలోనే పయనిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: మండలంలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కే తేజోత్స్న కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం పామిడిలోని మదీనా ఏరియా–1, ఎద్దులపల్లిరోడ్డు సచివాలయాలతో పాటు వంకరాజుకాలువ, రామరాజుపల్లి, రామగిరి సచివాలయాలతో కలిపి మొత్తం 5 శాశ్వత ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో ప్రజలు ఆధార్ సేవలను పొందాలని సూచించారు.

1116 లడ్డూలతో అభిషేకం



లడ్డూలతో దర్శనమిస్తున్న రామలింగేశ్వరుడు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామికి గురువారం 1,116 లడ్డూలతో అభిషేకం చేశారు. భాద్రపద మాసాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూలతో అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడు వద్ద నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పీఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైద్య సిబ్బందికి టీబీ టీకా



టీకా వేస్తున్న వైద్యాధికారి సుధాకర్

పామిడి: ఎద్దులపల్లి పీహెచ్‌సీలో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలకు ముందస్తు సై–టీబీ టీకాలు వేశారు. టీబీ రాకుండా ఈ టీకా ఉపయోగపడుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ తులసమ్మ, సూపర్‌వైజర్లు శ్రీరామిరెడ్డి, బాషా, సుధాకర్, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



కోటంకలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గార్లదిన్నె: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని డీపీఎం లక్ష్మనాయక్ పేర్కొన్నారు. బుధవారం కోటంక గ్రామంలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను విజయవాడ నుంచి వచ్చిన ఆర్‌వైఎస్ఎస్ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్‌వైఎస్ఎస్ ఈడీ నీరజ సమక్షంలో జీవామృతం, బీజామృతం, సీడ్ పెల్లటిజేషన్ ఇన్పుట్స్ ప్రిపరేషన్ చేశారు. సేంద్రియ ఎరువులతో కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేసిన ఏటీఎం మోడల్స్, ఏ గ్రేట్ మోడల్, క్యాస్టర్ మోడళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ నవీన్, సిబ్బంది నందని, అల్లీపీర, వెంకటరామిరెడ్డి, కార్తికేయ, చంద్రశేఖర్, చిరంజీవి ,రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'కారు, బైక్ రేసులతో ఏం ప్రయోజనం'



బైక్ రేసు ప్రమాదం చిత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజక వర్గంలో కార్, బైక్ రేసులతో ప్రజలకు ఒరిగిందేమి లేదని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శింగమల, నార్పల, పుట్లూరు, గార్లదిన్నె మండలాల అధ్యక్షులు ప్రసాద్, ఖాదర్‌వలి, మహేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి, చికెన్ నారాయణస్వామితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగునీరు లేక హెచ్చెల్సీ ఆయకట్టు భూములు బీడుగా మారాయన్నారు. ఏడాది పూర్తవుతున్నా రైతాంగానికి చుక్క నీరు కూడా విడుదల చేయడం లేదన్నారు. రైతులు పంటల సాగు కోసం ఎక్కడైనా విత్తనాలు, మందులు అందుబాటులో ఉంచారా అని ఎమ్మెల్యే శ్రావణిని ప్రశ్నించారు. యూరియా లేక రైతులు గగ్గోలు పెడుతుంటే కార్, బైక్ రేసుల నిర్వహణతో నియోజక వర్గం అభివృద్ధి చెందుతోందని చెప్పడం సిగ్గు చేటన్నారు. యువత ఉద్యోగాలు లేక దూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్, బైక్ రేసులతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని గ్రామీణ యువత మీద సిటీ కల్చర్ రుద్దడం సబబమేనా అని ప్రశ్నించారు. ముడుపులు తీసుకుని బైక్, కారు రేసుకు అనుమతి ఇచ్చారని తెలుగుదేశం పార్టీ వారే ఆరోపణలు చేస్తున్నారని గుర్తు చేశారు. రేసు బైక్ తగిలి ఓ యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడన్నారు. ఈ రేసులతో నిర్వాహకులు ఆర్థికంగా అభివృద్ధి అవుతారు తప్ప ప్రజలకు ఒరిగేది ఏమీలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వాటిని మళ్లీ నిర్వహిస్తే వైఎస్సార్ సీపీ పార్టీ అడ్డుకుంటుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే జయరామ్ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

గుంతకల్లుటౌన్: గుత్తి మండలం బేతాపల్లిలో సోలార్‌ప్లాంట్‌కు భూములిచ్చిన రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు వెళ్లిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పట్ల ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం రమేష్, కెవీపీఎస్ పట్టణ కార్యదర్శి రామునాయక్ పేర్కొన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల సమస్యలపై అహర్నిశలూ పోరాటాలు చేస్తున్న ప్రభాకర్ రెడ్డిని ఎమ్మెల్యే జయరామ్ నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడటం తగదన్నారు. జయరామ్ తన మాట తీర్పు మార్చుకోవాలని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలని వారు సూచించారు. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు వైటీసీ.రమేష్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి షబ్బీర్, షాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేది లేదు'

గార్లదిన్నె: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బెదిరింపులకు తమ సంఘం భయపడదని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు ఎమ్మెల్యే గుమ్మనూరు వ్యాఖ్యలపై గార్లదిన్నెలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బేతాపల్లిలో సోలార్ భూ నిర్వాసిత ప్రాంతాల్లో భూములు పరిశీలించేందుకు వెళ్లిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మండల నాయకులపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్‌లో నోరు పారేసుకున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, ఓబిలేసు, వలి, శివారెడ్డి, రాము, రమీజ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరివర్తన ఏకాదశి పూజలు



అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం పరివర్తన ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి వివిధ అభిషేకాలు, అర్చనల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం టీబీ ముక్తా అభియాన్‌లో భాగంగా టీబీ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. టీబీ యూనిట్ సూపర్ వైజర్లు దేవదాస్, మన్సూర్ 10 మందికి కంది బేడలు, బెల్లం, నూనె, రాగి పిండి, శనక్కాయలు, కోడి గుడ్లు వంటివి అందజేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్ రెడ్డి, పీఆర్వో డాక్టర్ బి. ఓంప్రకాష్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ తదితరులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే..ఎలాంటి అనర్థాలకు దారి తీస్తాయో వివరించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్గించే పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు (35) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రమాదేవి ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నాగసూరి సాహిత్యం విలక్షణం



మాట్లాడుతున్న సీనియర్ రచయిత నాగసూరి వేణుగోపాల్

అనంతపురం కల్చరల్: నాగసూరి సాహిత్యం విలక్షణమని వక్తలన్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలో ఆంధ్రభారతి ఆధ్వర్యంలో 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సమాలోచన జరిగింది. మాజీ వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పూజారి పద్మశ్రీ, ఆత్మియ అతిథులుగా మాట్లాడుతూ నాగసూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్‌గా, సాహిత్య పరిశోధకుడిగా ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. డాక్టర్ అంకే శ్రీనివాసులు పప్పూరి రామాచార్యులు అనే అంశంపై, రాజారామ్ 'సిగ్నేచర్ ట్యూన్' అనే అంశంపై, 'సాహితీ స్పర్శ సాహితీ వీక్షణం' అనే అంశంపై డాక్టర్ హేమమాలిని, 'విద్యాన్ విశ్వం' అనే అంశంపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ప్రసంగించారు. నాగసూరి సాహిత్యంలోని అనేక మౌళిక అంశాలను వివరించారు. రెండో సమావేశంలో సాహిత్యము–సైన్సు అనే అంశంపై డాక్టర్ ప్రగతి మాట్లాడారు. ఆత్మీయ అతిథులుగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, హారిక కుసుమ్, డాక్టర్ జీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ జన మాధ్యమాలలో తెలుగు భాష భిన్న రూపాలను సంతరించుకుంటున్న తీరును నాగసూరి వేణుగోపాల్ నిర్దిష్టంగా వివరించి విశ్లేషించారని తెలిపారు.

